# ఆర్‌హెచ్ అననుకూలతపై అవగాహన బహు స్వల్పం

## ప్రముఖ గైనకాలజిస్ట్ బాలాంబ హితవు



హైదరాబాద్ : గర్భానికి సంబంధించిన తీవ్ర రుగ్మత ఆర్‌హెచ్ అననుకూలత విపరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి. గర్భస్రావాలు, నిర్ణీత వ్యవధికి ముందే జననాలు, హీమోలిథిక్ రక్తలేమి, గర్భంలోనే ఉన్న శిశువుకు ఇతర తీవ్ర ఆరోగ్య సమస్యలు వంటివి సంభవించవచ్చు. దురదృష్టవశాత్తు అటువంటి పరిస్థితి పట్ల దేశంలో జనంలో చైతన్యం బాగా తక్కువగా ఉండడం వల్ల అనేక మంది మహిళలు సకాలంలో పరీక్షలు, చికిత్సలు చేయించుకోలేకపోవడం జరుగుతోంది. ఆర్‌హెచ్ అననుకూలత లేదా మహిళ, శిశువు ఆర్‌హెచ్ ఫ్యాక్టర్‌లో వ్యత్యాసం తక్కువ అంటే 2 నుంచి 5 శాతం వరకు ఉంటున్నది. అయితే, సకాలంలో పరీక్షలు, వైద్య చికిత్స జరిగేలా చూసేందుకు గర్భిణులు అందరికీ ఆర్‌హెచ్ ఫ్యాక్టర్ టైపింగ్‌కు సంబంధించి పరీక్షలు జరిపించడం తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. ఉస్మానియా వైద్య కళాశాల మాజీ ప్రొఫెసర్, ఆబ్‌స్టెట్రిక్స్, గైనకాలజీ విభాగం పూర్వపు అధిపతి డాక్టర్ బాలాంబ ఈ సందర్భంగా మాట్లాడుతూ, 'ఆర్‌హెచ్ ఫ్యాక్టర్ (రీసస్ ఫ్యాక్టర్) ఎర్ర రక్త కణాలపైన కనిపించే జన్యుపరంగా సంక్రమించే ప్రొటీన్, కొందరికి ఆ ప్రొటీన్ వారసత్వంగా సంక్రమిస్తుంది (ఆర్‌హెచ్ పాజిటివ్). మరి కొందరికి అలా జరగదు (ఆర్‌హెచ్ నెగటివ్). ఆర్‌హెచ్ నెగటివ్ తల్లి ఆర్‌హెచ్ శిశువును గర్భం దాల్చినప్పుడు తలెత్తే సమస్య ఆర్‌హెచ్ అననుకూలత. ఇది తీవ్ర పరిణామాలకు దారి తీసే ప్రమాదం ఉంది. ఎందుకంటే తల్లిలోని రోగనిరోధక వ్యవస్థ ఆర్‌హెచ్ పాజిటివ్ శిశువు కణాలను అన్య కణాలుగా భావించి వాటిపై దాడి చేయవచ్చు. దానికి చికిత్స జరగకపోయిన పక్షంలో గర్భస్రావాలు, మందస్తు జననాలు లేదా శిశువులో హీమోలిథిక్ రక్తలేమి, తీవ్ర పచ్చ కామెర్లు, మెదడు దెబ్బ తినడం, మానసిక వైకల్యం, వినికిడి, మాట లోపం వంటి తీవ్ర ఆరోగ్య రుగ్మతలు చోటు చేసుకోవచ్చు' అని సూచించారు. గర్భిణి, ఆమె శిశువు మధ్య ఆర్‌హెచ్ టైపింగ్‌లో వ్యత్యాసం ఉన్నట్లయితే శిశువు రక్తం ప్లాసెంటా ద్వారా తల్లి రక్తప్రవాహంలో కలిసిపోవచ్చు. అది తల్లి రక్తంలో యాంటీబాడీల ఉత్పత్తికి దారి తీయవచ్చు. మొదటిసారి ఉత్పత్తి అయ్యే ఐజిఎం యాంటీబాడీలు ప్లాసెంట అడ్డుగోడ దాటి ముందుకు పోవు. కాని ప్లాసెంటా లీక్‌లు పెరుగుతాయి. దీనిని ఫీటో మెటర్నల్ హెమరేజ్‌గా పేర్కొంటారు. 28 వారాల గర్భం అనంతరం ఐజిఎం యాంటీబాడీలు విడుదల అవుతాయి. అవి శిశువు ఎర్ర కర్త కణాలను నాశనం చేస్తాయి. అది శిశువులో రక్తలేమికి, శిశువు గుండె వైఫల్యం, మరణం వటి ఇతర విపరిణామాలకు దారి తీయవచ్చు. ఆర్‌హెచ్ విపరిణామాలకు ఉన్న అవకాశంపై జనంలో కూడా చైతన్యం తీసుకురావలసిన అగత్యం ఉంది.